క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తిచేయండి

హౌసింగ్ పీడీ దామోదర్‌రావు



భవనాన్ని పరిశీలిస్తున్న పీడీ దామోదర్‌రావు

తొగుట(దుబ్బాక): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలని హౌసింగ్ పీడీ దామోదర్‌రావు సూచించారు. మండల కేంద్రమైన తొగుటలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు అధికారుల సూచనల మేరకే ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామి, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, నర్సింహులు, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాకర్ అందజేత



లాకర్ అందిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ భువనేశ్వరి రూ.1.50 లక్షల విలువైన లాకర్‌ను మల్లన్న ఆలయ ఈఓ అన్నపూర్ణకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, సిద్దిపేట రీజినల్, జోనల్ మేనేజర్‌లు మారుతి, క్రాంతి కుమార్, కొమురవెల్లి బ్రాంచి మేనేజర్ అర్జున్, ఆలయ ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రత్యేక అధికారి మల్లయ్య



ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న మల్లయ్య

దుబ్బాక: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రత్యేక అధికారి, ఏడీఏ మల్లయ్య అన్నారు. మండలంలోని పెద్దగుండవెల్లిలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థుల చదువులు, భోజనం, ఇతర సమస్యల గురించి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో పర్యటించి పంచాయతీ కార్యదర్శి మురళితో మాట్లాడారు. అనంతరం ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చైర్మన్ ఏల్పుల మహేశ్, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇబ్బందులు ఉండొద్దు



రోగులతో మాట్లాడుతున్న జయదేవ్ ఆర్య

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్డీఓ పీడీ జయదేవ్ ఆర్య సూచించారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలు, ల్యాబ్, మందులు, రికార్డులను పరిశీలించారు. వైద్యం అందే తీరు గురించి రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, విధులకు సక్రమంగా హాజరుకావాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జనార్దన్, ఎంపీఓ సామిరెడ్డి, వైద్యురాలు ఐశ్వర్య, సిబ్బంది ఉన్నారు.

అనుమతి లేని వెంచర్లపై చర్యలు తప్పవు

ఎంపీడీఓ శ్రీనివాస వర్మ

కొమురవెల్లి(సిద్దిపేట): అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శ్రీనివాసవర్మ హెచ్చరించారు. మండలంలోని గురువన్నపేట గ్రామంలో అనుమతి లేకుండా చేసిన వెంచర్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ సిబ్బందితో హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడలంలో ఎటువంటి అనుమతిలేని వెంచర్లలో ప్లాట్లను విక్రయించి తర్వాత ఇబ్బందులు పడొద్దన్నారు. పంచాయతీ అనుమతి ఉంటేనే కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కూలుతున్నా.. కన్నెత్తి చూడరా?

పశువులు, ఇతర జీవాలు మన నేస్తాలు. వ్యవసాయంలో పశువులు చేసేమేలు చెప్పలేనిది. అలాంటి వాటికి వైద్యం అందించడం చాలా ముఖ్యం. యాభై ఏళ్లుగా ఎన్నో మూగ జీవాలకు చికిత్స అందించిన ఓ పశువుల దవాఖాన ఇప్పుడు మూగబోయే దశకు చేరింది.

శిథిలావస్థలో పశువుల దవాఖాన

- 50 యేళ్లుగా ఎన్నో సేవలు
- ఊడి పడుతున్న పైకప్పు పెచ్చులు.. జీటలు వారిన గోడలు
- కనీస సౌకర్యాలు కరువు
- ఆందోళనలో రైతులు, పశువుల కాపరులు, అధికారులు



కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ పశు వైద్యశాల



నాచు పట్టిన గోడలు



పెచ్చులు ఊడుతున్న పై కప్పు



బీటలు వారిన గోడలు, ధ్వంసమైన తలుపులు

హుస్నాబాద్: పట్టణంలో ప్రభుత్వ పశువుల దవాఖాన భవనం నిర్మించి దాదాపు యాభై సంవత్సరాలు గడిచింది. అప్పట్లో రైతులంతా కలిసి తలో చేయి వేసి గూన పెంకుల షెడ్డు నిర్మించారు. చందాలు వేసుకొని డంగు సున్నంతో స్లాబ్‌వేసి భవనాన్ని కట్టించారు. ఆ భవనం ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో రెండు చిన్నపాటి గదులు మాత్రమే ఉన్నాయి. అందులో వెటర్నరీ ఏడీ, వీఏ, అటెండర్‌లు విధులు నిర్వహిస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

పట్టణ పరిధిలో వందలాది పశువులు, నాలుగు వేలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. అలాగే సుమారు మూడు వందల వరకు పెంపుడు కుక్కలు ఉన్నాయి. నిత్యం పశువులకు వైద్య సేవలు అందుతూనే ఉంటాయి. అయితే వైద్యులు చేతులు శుభ్రపర్చుకోడానికి కూడా నీటి సౌకర్యం లేదు. ఆస్పత్రి ఎదురుగా ఉన్న మున్సిపల్ ట్యాంక్ ద్వారా వచ్చే నీటిని క్యాన్ల ద్వారా తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి. భవనం పైకప్పు కూలడానికి సిద్ధంగా ఉంది. పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం వస్తే పై కప్పు, గోడ పగుళ్ల నుంచి వర్షపు నీరు గదుల్లోకి చేరుతుంది. శిథిలావస్థకు చేరుకున్న దవాఖాన భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితిలో ఉంది.

నివేదిక అందించాం

పశువుల దవాఖాన భవనం శిథిలావస్థకు చేరుకుందని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. పై కప్పు నుంచి పెచ్చులు ఊడిపోతున్నాయి. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. వర్షం వస్తే ఉండటానికి వీలు లేకుండా స్లాబ్, గోడల నుంచి నీళ్లు కారుతుంటాయి. కనీసం చేతులు కడుక్కోవడానికి కూడా నీటి వసతి లేదు.

– వెంకట్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టరు, హుస్నాబాద్

పట్టించుకోని అధికారులు, నాయకులు

నాటి నుంచి నేటి వరకు ఎవరు అధికారంలోకి వచ్చినా శిథిలావస్థలో ఉన్న ఈ పశువుల దవాఖాన భవనాన్ని పట్టించుకోవడం లేదు. కనీసం మరమ్మతులు చేపట్టాలనే ధ్యాస కూడా లేకుండా పోయింది. పట్టణంలో అన్నిశాఖలకు సంబంధించిన భవన నిర్మాణాలకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి అధునాతనంగా నిర్మిస్తున్నారు. ఈ దవాఖాన శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని రైతులు, పశువుల కాపరులు వాపోతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ పట్టణంలోని పశువుల దవాఖానకు ఈ దుస్థితి ఏమిటని రైతులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి



పాదయాత్ర చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలో ధ్వంసమైన బీటీ రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె కమాన్ నుంచి మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం వరకు బీఆర్‌ఎస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. తహశీల్దార్ క్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు 20 నెలలు గడుస్తున్నా రోడ్లు ధ్వంసమైనా మరమ్మతులు చేపట్టడంలేదన్నారు. మండల వ్యాప్తంగా అతుకులు గతుకుల రోడ్లతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూకూరి లింగం, మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో విఫలం

సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి ర్యాకం శ్రీరాములు అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడు తూ ఇందిరమ్మ ఇళ్లను అనర్హులకే కేటాయించారని ఆరోపించారు. పింఛన్ల పెంపు ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. నియోజకవర్గంలో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని అసహనం వ్యక్తం చేశారు.

హామీలను నెరవేర్చాలి

గజ్వేల్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా ఉద్యమకారులను పట్టించుకోవడం లేదన్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని, మరెంతో మంది కష్టాల్లో కూరుకుపోయారని వాపోయారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఇళ్లు, నెలకు రూ. 30 వేల భృతి, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షురాలు మహ్మద్ సుల్తాన ఉమర్, కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, వివిధ విభాగాల నాయకులు పుట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులే లక్ష్యం

సహకారశాఖ డివిజనల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): రైతులు, యువత, మహిళల ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే ధ్యేయంగా పీఏసీఎస్‌లకు అనుబంధంగా ప్రభుత్వం ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేసిందని సహకారశాఖ డివిజనల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ములుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం 2020లో పదివేల ఎఫ్‌పీఓల(రైతు ఉత్పత్తి దారుల సంస్థ) ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సీబీబీఓ(క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్)గా వ్యవహరిస్తున్న తెలంగాణ సహకార యూనియన్ ములుగుతో పాటు మరో ఏడు పీఏసీఎస్‌లను గుర్తించి ఎఫ్‌పీఓలకు అనుసంధానం చేశారని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యులుగా చేరేందుకు రూ.2 వేలు చెల్లించి వాటాదారులుగా నమోదు కావాలని సూచించారు. ఎఫ్‌పీఓలకు నేషనల్ ఏజెన్సీలు, ఎన్సీడీసీ, నాబార్డు ప్రోత్సాహంగా రూ.15 లక్షల ఈక్విటీ గ్రాంట్‌ను మంజూరు చేస్తారని తెలిపారు. వాటాధనంతోపాటు ఈక్విటీ గ్రాంట్‌ను వినియోగించుకుని నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీఈఓ రమేశ్‌బాబు, అకౌంటెంట్ స్వరూప, స్టాఫ్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

వర్గల్(గజ్వేల్): విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్‌టీయూ పోరాడుతుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధరశర్మ అన్నారు. మండల పరిధిలోని పలు పాఠశాలల్లో పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధరశర్మ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎం పోస్టును మంజూరు చేయాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. నర్సింహారెడ్డి, సుభాష్, చంద్రారెడ్డి, మల్లికార్జునస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన నేతలు



కార్యకర్తలతో కేంద్ర మంత్రి బండి సంజయ్

అక్కన్నపేట(హుస్నాబాద్): జనగామకు వెళ్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డితోపాటు పలువురు కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని, ఆ దిశగా కార్యకర్తలు కృషి చేయాలని బండి సంజయ్ సూచించినట్లు చెప్పారు. పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేలా కార్యాచరణ ప్రారంభించాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. వారి వెంట చెరుకు సంపత్, నూనావత్ మోహన్ నాయక్, జంగపల్లి శ్రీనివాస్, కల్యాణ్ విష్ణు, దూలం మల్లేశం, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఆదర్శ’లో ఆకట్టుకున్న మాక్ పోలింగ్



ఓటు వేయడానికి క్యూలో నిలబడిన విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. కెప్టెన్, వైస్ కెప్టెన్, హెడ్ బాయ్, హెడ్ గర్ల్, అసిస్టెంట్ హెడ్‌లకు ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు ఓటుహక్కు ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమాత్‌ను బలోపేతం చేద్దాం

ఉలేమా–ఎ–హింద్ సభ్యత్వ నమోదు



సభ్యత్వం నమోదు చేస్తున్న జమాత్-ఎ-హింద్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో జమాత్‌ను బలోపేతం చేద్దామని జమాతె ఉలేమా–ఎ–హింద్ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సోఫియా మసీద్ ఆవరణలో వారు శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింల నాయకత్వం జాతీయ సమస్యల పరిష్కారం, రిజర్వేషన్లు, ఉలేమా రక్షణ కోసం దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని జమాతె ఉలేమా–ఎ–హింద్ తమ బంధువులకు అవగాహన కల్పించి, జమాత్‌లో సభ్యులుగా చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జమాతె- ఉలేమా ఎ హింద్ సభ్యులు పాల్గొన్నారు.

నాచగిరి మాస్టర్ ప్లాన్ అమలుకు చర్యలు

ఆలయ చైర్మన్ రవీందర్‌గుప్తా



ప్లాన్‌ను పరిశీలిస్తున్న రవీందర్‌గుప్తా తదితరులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్ర అభివృద్ధి కోసం గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ పునరుద్ధరణకు ప్రతిపాదనలు, అమలు కోసం చర్యలు తీసుకోనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా చెప్పారు. శుక్రవారం ఆలయ ఈఓ విజయరామారావు పర్యవేక్షణలో ఆయన అధ్యక్షతన ఆలయంలో నిర్వహించిన ధర్మకర్తల మండలి తొలి సమావేశంలో పలు విషయాలపై తీర్మానాలు చేశారు. మాస్టర్ ప్లాన్ పునరుద్ధరణ, సరిపడా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం తీర్మానాలు చేశారు. అనంతరం బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్‌ను ప్రారంభించారు. సమావేశంలో ధర్మకర్తలు శేఖర్‌గుప్తా, ఉషశ్రీ, కిష్టయ్య, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, తిరుమలరావు, శ్రీహరి, నాగరాజు, జగన్నాథాచార్యులు పాల్గొన్నారు.

నైపుణ్యాల దినోత్సవం

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం దాగి ఉంటుందని, దానిని వెలికి తీసి జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. ప్రవంతి, సామ సువర్ణాదేవి, టీఎస్‌కేసీ కన్వీనర్ హరిప్రసాద్, శ్వేత, కిషోర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కళాశాలలో మైదాకు సంబురాలు నిర్వహించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 16 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.34 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కమిటీలు ఏర్పాటు చేయాలి

నంగునూరు(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థల గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు, ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల లక్ష్మణ్ సూచించారు. శుక్రవారం నంగునూరులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రెండో విడతగా జరుగుతున్న గ్రామ కమిటీల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో జరిగే దివ్యాంగుల సింహగర్జనకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. సంఘం నాయులు కనకయ్య, బాలరాజు, రాజు, నర్సింహులు, యాదగిరి, భూమయ్య, నర్సింగరావు, భిక్షపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గోరింటా పండింది..



గోరింటాకు పెట్టుకున్న చేతులను చూపుతున్న మహిళలు



ఆషాఢమాసం సందర్భంగా మహిళలు ఘనంగా గోరింటాకు సంబురాలు జరుపుకొన్నారు. నంగునూరులోని గల్లిక గణేశ్ కాలనీ మహిళలు శుక్రవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఒకే రకమైన చీరలు ధరించి చేతులకు గోరింటాకు తీర్చిదిద్దుకున్నారు.

– నంగునూరు(సిద్దిపేట)

విచారణ పూర్తి చేయాలని వినతి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక సంఘాల డబ్బును కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మెప్మా పరిధిలోని పలు స్వయం సహాయ సంఘాల్లో తమ పేరిట అక్రమంగా రుణాలు తీసుకున్నారని పలువురు బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, విచారణ జరిగిందన్నారు. కానీ ఈ విచారణ నివేదికను బయటపెట్టకపోగా బాధ్యులపై చర్యలు తీసుకోలేదని వాపోయారు. విచారణ సాగుతున్న క్రమంలో బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు ఫోన్‌లు చేసి రుణాలను చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించాలని ఎల్లయ్య డిమాండ్ చేశారు.

రోడ్డు ధ్వంసం.. తప్పని తిప్పలు

- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- అంబులెన్సు కూడా రాని పరిస్థితి
- చందాలు వేసుకుని మరమ్మతు పనులు



రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చుకుంటున్న గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వాలు మారుతున్నా.. ఖమ్మంపల్లి గ్రామానికి ప్రయాణ సౌకర్యం సమస్య తీరడం లేదు. రోడ్డు బాగాలేదని అంబులెన్సు కూడా గ్రామానికి రాలేని దుస్థితి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగానైనా రవాణాకు అనుకూలంగా రోడ్డు మార్గాన్ని బాగు చేసుకునేందుకు మండలంలోని ఖమ్మంపల్లి గ్రామస్తులు నడుం బిగించారు.

గ్రామస్తుల ఇబ్బందులు

గ్రామంలో సుమారు 1,900 జనాభా ఉంది. ఎన్నో యేళ్ల కిందట వేసిన బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అలాగే రోడ్డు పక్కన చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి ఆటంకంగా మారాయి. రోడ్డు మార్గం సరిగా లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ అవసరం వచ్చినా గ్రామస్తులు 8 కి.మీ దూరంలో ఉన్న సిద్దిపేట, రెండు కి.మీ దూరంలో ఉన్న మర్పడ్గ గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. నిత్యం సుమారు 50 మంది కూలీల కుటుంబాలు వారు సిద్దిపేటకు వెళ్తుంటారు. రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సు, ఆటోలు సైతం రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

చందాలు వేసుకుని..

గత్యంతరం లేక ద్విచక్ర వాహనాల్లో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులు చందాలు వేసుకొని రోడ్డును బాగు చేసుకునే పనులు చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ప్రజలు కష్టాలు పడుతుండటం గమనార్హం. ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమతు పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.